సాక్షి విశాఖపట్నం

గురువారం । 17 । ఏప్రిల్ । 2025



అభివృద్ధి పనులకు అడ్డంకులు 8లో



జీవీఎంసీ కమిషనర్‌నే నియమించలేరా? 8లో



ముగిసిన రాష్ట్ర స్థాయి నాటక పోటీలు 8లో

న్యూస్‌రీల్

సీనియర్ సివిల్ జడ్జిల బదిలీ



విశాఖ లీగల్ : నగరంలోని పలువురు సీనియర్ సివిల్ జడ్జిలు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. నగరంలో న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ గాజువాక ప్రధాన సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో శ్రీకాకుళం సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు వచ్చారు. గాజువాక ప్రధాన సీనియర్ సివిల్ జడ్జిగా ఉన్న వై.శ్రీలక్ష్మి అక్కడే అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా నియమితులయ్యారు. గాజువాక అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా ఉన్న ఎ.కృష్ణప్రసాద్ విజయనగరం న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శిగా నియమితులయ్యారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ

- రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

మహారాణిపేట: రెవెన్యూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందని, భవిష్యత్తులో ఎటువంటి భూ వివాదాలు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. విశాఖ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రీ సర్వేపై గ్రామ సభల్లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్‌ఎస్‌లో ఎక్కువగా ఆర్‌వోఆర్, రీసర్వే, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు, 22ఎ తొలగింపులు, ఇళ్ల స్థలాల మంజూరు కోసం దరఖాస్తులు వస్తున్నాయని, వాటిని పరిశీలించి, పరిష్కరిస్తున్నట్లు కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ మంత్రికి వివరించారు. విశాఖలో 22ఎ లో ఇళ్లు ఎక్కువగా ఉన్నాయని, ఈ అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టి, పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీశంకర్, రెవెన్యూ డివిజనల్ అధికారులు శ్రీలేఖ, సంగీత్ మహదూర్, మండల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఆక్రమణల క్రమబద్ధీకరణకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట: అభ్యంతరం లేని అనధికార ఆక్రమణలు, నివాసయోగ్యమైన కట్టడాల క్రమబద్ధీకరణకు జిల్లా యంత్రాంగం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. గ్రామ, వార్డు సచివాలయంలో క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకుని.. ఆ కాపీని తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సూచించారు. ఇప్పటి వరకు తహసీల్దార్లకు 1,606 దరఖాస్తులు వచ్చాయని, అన్ని దరఖాస్తులు ఆన్‌లైన్ చేయాలన్నారు. ప్రభుత్వ జీవో ప్రకారం 2019 అక్టోబర్ 15వ తేదీకి ముందు ఉన్న ఆక్రమణలను మాత్రమే పరిగణలోకి తీసుకుంటున్నారు. దరఖాస్తుదారుడు గతంలో ఎటువంటి గృహ నిర్మాణ పథకంలో ఇల్లు క్రమబద్ధీకరణ పొందకుండా ఉండాలనే నిబంధన అమలు చేస్తున్నారు. ఆక్రమణల క్రమబద్ధీకరణ కోసం ఈ ఏడాది డిసెంబర్ 31లోగా దరఖాస్తు చేసుకోవాలని జేసీ సూచించారు.

విధి విధానాలివే..

150 గజాల వరకు ఏపీఎల్/బీపీఎల్ కుటుంబాలకు డి.పట్టా, కన్వేయన్స్ డీడ్ ఉచితంగా ఇస్తారు. 151-300 చదరపు గజాలకు బేసిక్ విలువకు 15 శాతం చెల్లించాలి. 301-450 చదరపు గజాలకు బీపీఎల్ కుటుంబం బేసిక్ విలువకు 100 శాతం, ఏపీఎల్ కుటుంబం బేసిక్ విలువకు 200 శాతం చెల్లించాల్సి ఉంటుంది. 451 చదరపు గజాలకు ఏపీఎల్/బీపీఎల్ బేసిక్ విలువకు 5 రెట్లు చెల్లించాలి. ఈ రుసుం రెండు నెలల్లోగా చలానా రూపంలో ప్రభుత్వానికి చెందిన సీఎఫ్‌ఎంఎస్‌కు చెల్లించాలి.

దేవిశ్రీప్రసాద్ లైవ్ కన్సర్ట్‌కు పోలీసుల అనుమతి నిరాకరణ

సీతమ్మధార: పోర్ట్ స్టేడియంలో ఈ నెల 19న తలపెట్టిన దేవిశ్రీ ప్రసాద్(డీఎస్పీ) కన్సర్ట్‌కు పోలీసులు అనుమతి నిరాకరించారు. ఇటీవల అక్కడ ఓ బాలుడు చనిపోయిన నేపథ్యంలో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఈ నిర్ణయం తీసుకున్నారు. డీఎస్పీ మ్యూజికల్ నైట్ విశాఖలో రద్దు కావడం ఇది నాలుగోసారి. ఇప్పటికే ఈవెంట్ మేనేజర్లు టికెట్లను ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నారు. దీంతో ఈవెంట్ నిర్వహణకు నగరంలోని ఇందిరాగాంధీ స్టేడియం, గాజువాక, భీమిలిలోని పలు ప్రాంతాలను పరిశీలిస్తున్నారు.

హద్దుల్లేకుండా ఆశీలు దందా!





పూర్ణామార్కెట్ పరిధికి మించి ఆశీలు వసూలు



ఇది జీవీఎంసీ అధికారికంగా పూర్ణామార్కెట్ హద్దులను నిర్ణయిస్తూ వెలువరించిన గెజిట్. ఈ సరిహద్దుల్లోని షాపుల నుంచి మాత్రమే ఆశీలు వసూలు చేయాలని స్పష్టంగా పేర్కొంటూ జీవీఎంసీ టెండర్లను ఆహ్వానించింది!



ఇది అనధికారికంగా టెండర్‌ను దక్కించుకున్న కాంట్రాక్టరు ఆశీలు వసూలు చేస్తున్న ప్రాంతం. అంటే ఈ ప్రాంతమే కాకుండా అంతకు నాలుగింతల ప్రాంతాల్లో అనధికారికంగా ఆశీలు వసూలు చేస్తున్నారన్నమాట!


- టెండర్ నిబంధనల కంటే అధిక మొత్తం దోపిడీ
- అధికారిక ఉత్తర్వులు అందకుండానే కాంట్రాక్టర్ రంగంలోకి..
- అదనపు ఆదాయంలో కూటమి నేతలకూ వాటాలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

పూర్ణామార్కెట్‌లో ఆశీలు వసూలులో 'హద్దు' లేకుండా పోతోంది. మార్కెట్‌కు సంబంధం లేని ప్రాంతాల్లో కూడా బలవంతంగా షాపులకు వచ్చే వాహనాలతో పాటు ఆయా షాపుల ముందు ఏర్పాటు చేసే చిన్న చిన్న కొట్టుల నుంచి కూడా ఆశీలు వసూలు చేస్తున్నారు. వాస్తవానికి అధికారికంగా ఇంకా టెండర్‌ను స్టాండింగ్ కమిటీ ఆమోదించలేదు. ఇందుకు అనుగుణంగా కమిషనర్ నుంచి అధికారిక ఉత్తర్వులూ వెలువడలేదు. అయినప్పటికీ టెండర్‌ను దక్కించుకున్న కూటమికి చెందిన చోటా నేత కాస్తా బలవంతంగా ఆశీలును వసూలు చేస్తున్నారు. దీనిపై జీవీఎంసీ జోనల్ కమిషనర్ కానీ, ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్న కలెక్టరు కానీ కనీసం చర్యలు తీసుకునేందుకు సాహసించడం లేదు. ఇందుకు కూటమికి చెందిన స్థానిక ఎమ్మెల్యేతో పాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మరో టీడీపీ నేత అండదండలే ప్రధాన కారణమన్న ఆరోపణలున్నాయి. మార్కెట్ పరిధికి మించి, రేట్లకు మించి వసూలు చేస్తున్న అదనపు ఆదాయంలో కూటమి నేతలకూ వాటాలు అందుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. పూర్ణామార్కెట్ పరిధిని స్పష్టంగా తెలియజేస్తూ... హద్దులను ఏర్పాటు చేసి ఆశీలు వసూలు చేసేలా చర్యలు తీసుకుంటే తప్ప ఈ దోపిడీ ఆగదని స్థానిక వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు.

అన్నీ అధిక ఆశీలులే..!

టెండర్లను ఆహ్వానించిన సమయంలో ఎంత మేర ఆశీలు వసూలు చేయాలన్న విషయాన్ని జీవీఎంసీ స్పష్టంగా పేర్కొంది. ఇందుకు విరుద్ధంగా మూడు, నాలుగింతల మొత్తం ఎక్కువగా ఆశీలును కాంట్రాక్టరు వసూలు చేస్తున్నారు. లారీ కెపాసిటీని బట్టి లోడుకు రూ.75 నుంచి రూ.200 వరకూ ఆశీలు వసూలు చేయాల్సి ఉంది. ఆశీలు కాంట్రాక్టరు మాత్రం రూ.200 నుంచి రూ.500 నుంచి వరకూ వసూలు చేస్తున్నారు. రూ.200 వసూలు చేయాల్సిన చోట రూ.500, రూ.125 వసూలు చేయాల్సిన చోట రూ.400, రూ.75 వసూలు చేయాల్సి చోట రూ.200 వరకూ వసూలు చేస్తున్నారు. మినీ వ్యాన్ నుంచి రూ.75 వసూలు చేయాల్సి ఉండగా రూ.200 వరకు వసూలు చేస్తున్నారు. గూడ్స్ ఆటోకు రూ.25 వసూలు చేయాలని జీవీఎంసీ నిర్దేశించగా రూ.75కి పైగా దోచుకుంటున్నారు. కారు పార్కింగ్ కోసం రూ.10 వసూలు చేయాల్సి ఉండగా.. రూ.20 వసూలు చేస్తున్నారు. అదేవిధంగా టెండర్ నిబంధనల మేరకు కేవలం పూర్ణామార్కెట్ పరిధిలో మాత్రమే ఆశీలు వసూలు చేయాల్సి ఉండగా.. అంతకు నాలుగు రెట్ల ప్రాంతంలో కూడా ఆశీలును ముక్కుపిండి మరీ వసూలు చేయడం గమనార్హం.



అదనపు ఆదాయంతో అందరికీ వాటాలు

వాస్తవానికి జీవీఎంసీ పూర్ణామార్కెట్ హద్దులను స్పష్టం చేసింది. తూర్పున ప్రధాన రహదారి, దక్షిణాన వస్త్ర దుకాణాలు, పశ్చిమాన పండ్ల రసం దుకాణాలు ఉన్నాయని పేర్కొంది. ఇక ఉత్తర దిక్కున స్నేహ ఫుట్‌వేర్ షాపు ఉందని.. ఈ పరిధిలో మాత్రమే పూర్ణామార్కెట్ కిందకు వస్తుందని స్పష్టం చేసింది. ఈ పరిధిలోని షాపులకు వచ్చే వాహనాల నుంచి మాత్రమే ఆశీలు వసూలు చేయాలని టెండర్ నిబంధనల్లో పేర్కొంది. అయితే, ఆశీలు కాంట్రాక్టరు మాత్రం ఇటు నాలుగు చిలకల జంక్షన్ నుంచి డాల్ఫిన్ జంక్షన్ వరకు... డాల్ఫిన్ జంక్షన్ టర్నర్ చౌల్ట్రీ వరకు.. అక్కడ నుంచి కొత్త రోడ్ మీదుగా తిరిగి నాలుగు చిలకలు జంక్షన్ వరకూ ఉన్న షాపులకు సరుకులు తీసుకొచ్చే వాహనాల నుంచి ఆశీలును వసూలు చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే స్థానికంగా ఉన్న షాపుల యజమానులు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది. అయినప్పటికీ జీవీఎంసీ అధికారుల నుంచి కనీసం స్పందనలేదని వాపోతున్నారు. ఈ అదనపు ఆదాయమంతా కాంట్రాక్టర్ల జేబుల్లోకి వెళుతోందని.. ఇందులో కూటమి ప్రజా ప్రతినిధులకు కూడా వాటాలు అందుతున్నాయనే ఆరోపణలున్నాయి.

అవిశ్వాస ప్రయత్నంలో అజ్ఞానం

- జనసేన కార్పొరేటర్లకు చట్టమే తెలియదా?
- డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస ప్రయత్నం విఫలం
- ఆ పార్టీలో బయటపడ్డ అంతర్గత విభేదాలు
- కలెక్టర్ పంపిన లేఖను లీక్ చేసిన ఆ పార్టీ కార్పొరేటర్?

డాబాగార్డెన్స్: నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌లపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కూటమి కార్పొరేటర్లు సిద్ధమయ్యారు. ఈ మేరకు ఈ నెల 19న మేయర్‌పైన, 31న డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస తీర్మానానికి కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఇప్పటికే ప్రకటించారు. ఈ పరిణామాల మధ్య ఇద్దరు కార్పొరేటర్లు(ఎం.హేమలత(5వ వార్డు), పి.ఉషశ్రీ(43వ వార్డు)) మరో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్‌పై కూడా అవిశ్వాసం పెట్టేందుకు ప్రయత్నించారు. ఈ నెల 2న కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌ను కలిసి వినతి ప్రతం సమర్పించారు. కానీ వారి ప్రయత్నం విఫలమైంది. చట్టపరమైన అడ్డంకి ఎదురైంది. మున్సిపల్ కార్పొరేషన్ యాక్ట్ సెక్షన్ 91ఏ ప్రకారం నాలుగేళ్లు పూర్తి కాకుండా అవిశ్వాస తీర్మానం పెట్టడానికి వీలులేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఆ కార్పొరేటర్లకు లేఖ కూడా పంపారు. ఈ ఘటన రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం పెట్టేందుకు ప్రయత్నించిన ఆ ఇద్దరు కార్పొరేటర్లకు కనీసం చట్టం గురించి తెలియదా? ఎన్నికైన ప్రజాప్రతినిధులుగా వారికి మున్సిపల్ కార్పొరేషన్ చట్టాలు, సెక్షన్లపై కనీస అవగాహన ఉండాలి కదా? ఏమీ తెలియకుండా కలెక్టర్‌ను కలవడం వెనుక వారి ఉద్దేశం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. డిప్యూటీ మేయర్‌గా కటుమూరి సతీష్ 2021 జూలై 31న బాధ్యతలు చేపట్టారు. అంటే ఆయనపై అవిశ్వాసం పెట్టాలంటే సెక్షన్ 91ఏ ప్రకారం ఈ ఏడాది జూలై 31 తర్వాతే సాధ్యమవుతుంది. తోటి కార్పొరేటర్ ఎప్పుడు పదవి చేపట్టారో కూడా తెలియని ఈ ఇద్దరు కార్పొరేటర్ల పరిజ్ఞానంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, జనసేన పార్టీలో అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. ఆ పార్టీకి చెందిన ఓ కార్పొరేటరే స్వయంగా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ పంపిన లేఖను బహిరంగంగా విడుదల చేయడం గమనార్హం. ఆ ఇద్దరు కార్పొరేటర్ల అజ్ఞానాన్ని ఎత్తి చూపేందుకే ఆ కార్పొరేటర్ ఇలా చేశారా? లేదా ఇది పార్టీలోని అంతర్గత విభేదాల ఫలితమా? అనేది తేలాల్సి ఉంది. ఏదేమైనప్పటికీ, ఈ ఘటన జనసేనలో లుకలుకలు ఉన్నాయనే సంకేతాలను స్పష్టం చేసింది.

పిలవని పేరంటానికి అతిథులుగా..



వేదికపై సమీక్షలో కూర్చున్న ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు, వెలగపూడి, పంచకర్ల

- చందనోత్సవం సమీక్షలో స్థానిక ఎమ్మెల్యే గంటాకే ఆహ్వానం
- ఆహ్వానం లేకున్నా.. హాజరైన పల్లా, పంచకర్ల, వెలగపూడి, విష్ణుకుమార్‌రాజు

సింహాచలం: పిలవని పేరంటానికి అతిథులుగా వెళ్లాలంటే సిగ్గనిపిస్తుంది. కూటమి ప్రభుత్వానికి చెందిన నలుగురు ఎమ్మెల్యేలు మాత్రం ఎలాంటి సందేహాలకు పోకుండా.. అప్పన్న చందనోత్సవ నిర్వహణపై బుధవారం జరిగిన సమీక్షకు హాజరవడం చర్చనీయాంశమైంది. దేవదాయశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, హోం, రెవెన్యూ మంత్రులు, సింహాచలం దేవస్థానం అనువంశిక ధర్మకర్తతోపాటు విశాఖ ఎంపీ భరత్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, దేవదాయశాఖ, జిల్లా, దేవస్థానం అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించాల్సి ఉంది. ఈ పద్ధతినే అనుసరిస్తూ ఈ నెల 7న ప్రభుత్వ(దేవదాయశాఖ) కార్యదర్శి వినయ్‌చంద్ ఉత్తర్వులు కూడా జారీచేశారు. ఆయా మంత్రులకు, అధికారులకు ఉత్తర్వుల కాపీలను పంపించారు. దాని ప్రకారం బుధవారం సింహాచలానికి సమీపంలోని శ్రీనివాసనగర్‌లో ఉన్న దేవస్థానానికి చెందిన నూతన కల్యాణమండపంలో దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కూడా హాజరయ్యారు. దీంతో అక్కడ ఉన్నవారంతా ఆశ్చర్యపోయారు. ఆహ్వానం లేకపోయినా వచ్చిన వారిని పొమ్మనలేం కదా.. అన్నట్టు వారిని కూడా సమీక్షలో కూర్చోబెట్టినట్లు పలువురు చెప్పుకుంటున్నారు. అయితే ఆహ్వానం లేకపోవడంతో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు సమీక్షకు హాజరుకాలేదని తెలుస్తోంది. ఇదిలావుండగా అనకాపల్లి జిల్లాకు చెందిన కొందరు ఎమ్మెల్యేలు కూడా తమను సమీక్షకు ఆహ్వానించకపోవడంపై గుర్రుమీదున్నారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఈ విషయంపై మీడియా ముందు, బాహాటంగానే తమ అసంతృప్తిని వెళ్లగక్కారు.

అంటరాని వారిగా చూస్తున్నారా..

- చందనోత్సవ సమీక్షకు బండారుకు అందని ఆహ్వానం
- వివక్ష చూపిస్తున్నారని అసంతృప్తి

మహారాణిపేట : సింహాచలం చందనోత్సవ ఏర్పాట్లపై జరిగిన సమీక్ష సమావేశానికి తనను ఆహ్వానించకపోవడంపై మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రిగా, సీనియర్ నేతగా ఉన్నప్పటికీ తనను విస్మరించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సింహాచలంలో బుధవారం జరిగిన ఈ సమావేశానికి తనను పిలవకపోవడంపై జెడ్పీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ తన ఆవేదనను వెళ్లగక్కారు. 42 ఏళ్ల రాజకీయ జీవితంలో ఐదు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన తనను ఇలా విస్మరించడం బాధాకరమన్నారు. పెందుర్తి ఎమ్మెల్యేగా నాలుగుసార్లు పనిచేసిన తాను స్థానికుడినని, సింహాద్రి అప్పన్నపై తనకు ఎంతో భక్తి ఉందన్నారు. తన తండ్రి, కుమారుడి పేర్లు కూడా స్వామివారి పేరుతోనే ఉంటాయని గుర్తు చేశారు. తాను మంత్రిగా మూడుసార్లు స్వామికి పట్టువస్త్రాలు సమర్పించానని చెప్పారు. సమావేశం నిర్వహించడం తప్పు కాదని, కానీ తమను అంటరానివారిగా చూడటం బాధ కలిగించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అందరినీ కలుపుకొని వెళ్లాలని చెబుతుంటే, ఇక్కడ మాత్రం వేరు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే రోజు రెండు ముఖ్యమైన సమావేశాలు పెట్టారని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కూడా వ్యాఖ్యానించారు.

బీసీ రుణాలపై పచ్చ గెద్దలు



జోన్-3లో దరఖాస్తులను పరిశీలిస్తున్న సిబ్బంది

నిబంధనలను గాలికొదిలేసిన బీసీ కార్పొరేషన్

చినవాల్తేర్‌కు చెందిన చింతపల్లి సూర్యనారాయణ అనే వ్యక్తికి రూ.2 లక్షలు రుణం మంజూరు కావడం పెద్ద దుమారం రేపింది. కూటమి పార్టీకి విధేయుడిగా ఉన్నందుకే నాయిబ్రాహ్మణ వర్గానికి చెందిన అతనికి ఇతర అర్హులను పక్కనపెట్టి మరీ సెలూన్ షాప్ ఏర్పాటు నిమిత్తం బీసీ కార్పొరేషన్ అధికారులు రుణం మంజూరు చేసినట్లు తెలుస్తోంది. సూర్యనారాయణ మాదిరిగానే 20, 21 వార్డుల్లో కూటమి నాయకులకు అడ్డగోలుగా రుణాలు మంజూరు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

రుషికొండకు చెందిన మంగా రెడ్డి అనే వ్యక్తికి వాహనం కొనుగోలుకు **రూ.5 లక్షల రుణం మంజూరైంది.** భీమిలి నియోజకవర్గానికి చెందిన జనసేన నాయకుడి సిఫార్సుతో బీసీ కార్పొరేషన్ అధికారులు ఆ పార్టీకి విధేయుడైన మంగారెడ్డికి ఈ రుణం మంజూరు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అతనితో పాటు ఆ జనసేన నాయకుడు మరికొందరికి తన సిఫార్సులతో అడ్డగోలుగా రుణాలు ఇప్పించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

- తాము పంపిన జాబితానే ఓకే చేయాలని హుకుం
- టీడీపీ నేతల సిఫార్సులతో అర్హులకు మొండిచేయి

ఎంవీపీకాలనీ: జిల్లా బీసీ కార్పొరేషన్ రుణాలు పక్కదారి పట్టాయి. నిబంధనల ప్రకారం అర్హులైన లబ్ధిదారులకు చేరాల్సిన రుణాలు కూటమి కార్యకర్తలకు దాసోహం అవుతున్నాయి. ఇటీవల సీఎం చంద్రబాబు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను వైఎస్సార్ సీపీకి, వారి కార్యకర్తలకు ప్రభుత్వం ద్వారా ఎలాంటి లబ్ధి చేకూర్చవద్దంటూ చేసిన వ్యాఖ్యలను బీసీ కార్పొరేషన్ ఉన్నతాధికారులు పుణికిపుచ్చుకుని మరీ ఈ రుణాల మంజూరు కోసం పని చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇతర పార్టీలకు చెందిన అర్హులైన లబ్ధిదారులను పక్కన పెట్టి.. కూటమి కార్యకర్తలకు రెడ్ కార్పెట్ పరుస్తున్నారు. దరఖాస్తు మినహా రుణాల మంజూరుకు అవసరమైన మిగతా ప్రక్రియ అంతా కూటమి నాయకుల కనుసన్నల్లోనే జరుగుతోంది. ఎమ్మెల్యేలు, నియోజకవర్గం, మండల స్థాయి నాయకులు చెప్పిన వారికే రుణాలు మంజూరు చేస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఇటీవల తొలి విడత గా ప్రకటించిన రుణాలు ఇందుకు అద్దం పడుతున్నాయి.



తొలివిడత లబ్ధిదారులకు కార్పొరేషన్ రుణాల చెక్కు అందజేస్తున్న కలెక్టర్ (ఫైల్)


వారి మేలుకే హడావుడి నోటిఫికేషన్

కూటమి నాయకులు, కార్యకర్తలకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ రుణాలకు నోటిఫికేషన్ విడుదల చేసిందనే ఆరోపణలు ఉన్నాయి. 2024-2025 ఆర్థిక సంవత్సరం చివర్లో (మార్చి) హడావుడిగా ఈ రుణాలకు నోటిఫికేషన్ విడుదల చేయడమే ఇందుకు నిదర్శనం. ఇతర కార్పొరేషన్ల రుణాల మంజూరుకు నోటిఫికేషన్ విడుదల చేయని ప్రభుత్వం.. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న సమయంలో బీసీ కార్పొరేషన్ పరిధిలోని కాపు, కమ్మ, బ్రాహ్మణ, క్షత్రియ, ఈబీసీ తదితర కార్పొరేషన్ల రుణాల మంజూరుకు మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేయడం పట్ల సర్వత్రా విమర్శలున్నాయి. దరఖాస్తు గడువును కూడా కేవలం 12 రోజుల్లోనే ముగించడం పట్ల కూడా అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఇందుకు అనుగుణంగానే ప్రస్తుతం అర్హతను పక్కనపెట్టి మరీ కూటమి నాయకులు చెప్పిన వారికే ఈ రుణాలు కేటాయిస్తున్నట్లు స్పష్టమవుతోంది. దరఖాస్తుల పరిశీలన, ఇంటర్వ్యూలు, బ్యాంక్ అనుమతి వంటి ప్రక్రియలన్నీ ముందుకు సాగుతున్నట్లు సమాచారం.

16,659 మంది దరఖాస్తు

బీసీ స్వయం ఉపాధి రాయితీ రుణాలకు జిల్లాలో 16,659 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు ఆన్‌లైన్ దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా బీసీ కార్పొరేషన్ కార్యాలయం వెల్లడించింది. ప్రభుత్వం జిల్లాలో 1984 స్వయం ఉపాధి రుణాల యూనిట్లు కేటాయించింది. ఇందులో భాగంగా బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాలకు 1,615 యూనిట్లు కేటాయించగా 15,619 మంది దరఖాస్తు చేసుకున్నారు. జనరిక్‌కు ఫార్మసీలకు 33 యూనిట్లు కేటాయించగా 33 మంది, ఈబీసీ కార్పొరేషన్ ద్వారా 36 యూనిట్లకు 177 మంది, కమ్మ కార్పొరేషన్ ద్వారా 14 యూనిట్లకు 18 మంది, రెడ్డి కార్పొరేషన్ ద్వారా 40 యూనిట్లకు 264 మంది దరఖాస్తు చేసుకున్నారు.

బీసీ కార్పొరేషన్ మానిటర్‌గా వ్యవహరిస్తుంది



ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం రుణాల మంజూరు ప్రక్రియను పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. జిల్లా బీసీ కార్పొరేషన్ ఈ రుణాల మంజూరుకు సంబంధించి మానిటరింగ్ అథారిటీగా వ్యవహరిస్తోంది. దరఖాస్తుల పరిశీలన, ఇంటర్వ్యూలు, బ్యాంకు అనుమతి ఇలా అన్ని జోనల్ కమిషనర్లు, ఎంపీడీవోల పరిధిలో జరుగుతున్నాయి. వారి లాగిన్‌లో అప్‌డేట్ చేసిన లబ్ధిదారుల డేటాను ఈడీ లాగిన్ నుంచి కలెక్టర్‌కు పంపిస్తాం. కూటమి పార్టీల కార్యకర్తలకే కేటాయింపులు జరుగుతున్నాయనే అంశంపై మాకు సమాచారం లేదు. పారదర్శకంగా అర్హులైన వారికి రుణాల మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– శ్రీదేవి, ఈడీ, బీసీ కార్పొరేషన్

అధికారులతో మంత్రి సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి వీరాంజనేయులు

ఎంవీపీకాలనీ: జిల్లాలోని వివిధ కార్పొరేషన్లు, సంక్షేమ శాఖల అధికారులతో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయులు సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరంలోని ప్రభుత్వ అతిథిగృహంలో బుధవారం ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బీసీ, ఎస్సీ కార్పొరేషన్ల ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాల దరఖాస్తు ప్రక్రియ, పర్యవేక్షణపై మంత్రి ఆరా తీశారు. సాంఘిక సంక్షేమశాఖ, బీసీ సంక్షేమశాఖ, ఎస్సీ ఇంజినీరింగ్ విభాగం ద్వారా నిర్వహిస్తున్న పలు ప్రాజెక్టుల పురోగతి, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు తదితర అంశాలపై ఆయా అధికారులతో చర్చించారు. జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ రామారావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్య పద్మ, ఇంజనీరింగ్ విభాగం ఈఈ రమేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సమతా ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: నాగ్‌పూర్ డివిజన్ పరిధి రునిజా–కలమ్మ స్టేషన్ల మధ్య జరుగుతున్న మూడో లైన్ సంబంధిత ప్రి నాన్ ఇంటర్ లాకింగ్, నాన్-ఇంటర్ లాకింగ్ పనుల నిమిత్తం ఆయా తేదీల్లో సమతా ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నంలో ఈ నెల 30, మే 3, 5, 6, 8వ తేదీల్లో బయల్దేరే విశాఖపట్నం–హజరత్ నిజాముద్దీన్(12807) సమతా ఎక్స్‌ప్రెస్, తిరుగు ప్రయాణంలో హజరత్ నిజాముద్దీన్‌లో మే 2, 3, 5, 6, 8వ తేదీల్లో బయల్దేరే హజరత్ నిజాముద్దీన్–విశాఖపట్నం (12808) సమతా ఎక్స్‌ప్రెస్‌లు రద్దయినట్లుపేర్కొన్నారు.

క్షతగాత్రులకు జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ



కేజీహెచ్‌లో క్షతగాత్రులను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

మహారాణిపేట: కోటవురట్ల మండలం కై లాసపట్నంలో బాణసంచా పేలుడులో గాయపడ్డవారిని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర పరామర్శించారు. క్షతగాత్రులకు అందుతున్న వైద్యం గురించి కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మాధవిలత, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ మోహర్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.

అప్పన్న సన్నిధిలో మంత్రులు



బేడా ప్రదక్షిణ చేస్తున్న మంత్రులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, వీరాంజనేయస్వామి, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వారి పేరిట అంతరాలయంలో అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదం, జ్ఞాపికలను దేవస్థానం ఈవో కె.సుబ్బారావు అందించారు.

అభివృద్ధి పనులకు అడ్డంకులు

- ఎమ్మెల్యేల తీరుపై జెడ్పీటీసీ, ఎంపీపీల ఆగ్రహం
- యలమంచిలిలో ఈ ధోరణి ఎక్కువ
- జెడ్పీ సమావేశంలో నిరసన
- కలెక్టర్ జోక్యం కోరిన చైర్‌పర్సన్
- బాణసంచా ప్రమాద బాధితులకు సంతాపం



పొడియం చుట్టుముట్టి నిరసన తెలుపుతున్న జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు



సమావేశానికి హాజరైన జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎమ్మెల్యేలు, ఎంపీ

మహారాణిపేట: గ్రామ, మండలాల్లో పలు అభివృద్ధి పనులకు అధికారులు, ఎమ్మెల్యేలు అడ్డుపడుతున్నారని పలువురు జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ అంశంపై తీవ్ర చర్చ జరిగింది. యలమంచిలి నియోజకవర్గంలో ఈ ధోరణి ఎక్కువగా ఉందని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఆ నియోజకవర్గ జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో పోడియం ముందు వారు నిరసన వ్యక్తం చేయగా, ఇతర జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీ లు వారికి మద్దతు తెలిపారు. ఉపాధి హామీ పను లు, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం, ఇతర జిల్లా పరిషత్ నిధుల వినియోగంలో జెడ్పీటీసీలు, ఎంపీపీలకు పూర్తి అధికారాలు ఉన్నప్పటికీ.. తమ సూచనల మేరకు పనులు జరగడం లేదని వాపోయారు. ఎమ్మెల్యే చెప్పిన పనులనే అధికారులు చేస్తున్నారని మునగపాక జెడ్పీటీసీ పెంటకోట సోమ సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో గెలిచి ప్రజాప్రతినిధులుగా ఎన్నికైనప్పటికీ తమకు తగిన ప్రాధాన్యం లభించడం లేదని, ఎమ్మెల్యే చెప్పిన పనులు చేయకపోతే బిల్లులు ఆగిపోతాయని బెదిరిస్తున్నారని సభ్యులు వాపోయారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎక్కడా ఇలాంటి పరిస్థితి లేదని, సీనియర్ ఎమ్మెల్యేలు హుందాగా ప్రవర్తిస్తున్నారని, యలమంచిలిలో మాత్రం విచిత్రమైన ధోరణి ఉందన్నారు. దీనిపై జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. కలెక్టర్ జోక్యం చేసుకోవాలని కోరారు.

సమావేశం సాగిందిలా..

- కె.కోటపాడులో పాఠశాల గోడ నిర్మాణంపై వివాదం నెలకొంది. పాఠశాల విద్యార్థుల కోసం ప్రహరీ నిర్మాణం పెంచాలని కోరినా అధికారులు పట్టించుకోకుండా కిచెన్ గార్డెన్ నిర్మాణం చేస్తున్నారని కె.కోటపాడు జెడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రహరీ నిర్మించాలని ఎప్పటి నుంచో కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.
- మెడికల్ షాపుల్లో గడువు ముగిసిన మందులు విక్రయిస్తున్నారని, దీనిపై జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌కు ఎన్ని సార్లు ఫోన్ చేసినా పట్టించుకోవడం లేదని బుచ్చయ్యపేట సభ్యుడు దొండ రాంబాబు అన్నారు. మరికొందరు జెడ్పీటీసీ సభ్యులు కూడా ఇదే సమస్యను ప్రస్తావించారు. వచ్చే సమావేశానికి ఉమ్మడి జిల్లాల్లో ఎన్ని మందుల షాపులు ఉన్నాయి? ఎన్ని షాపుల్లో తనిఖీలు నిర్వహించారు? ఎన్ని షాపులపై చర్యలు తీసుకున్నారో తెలియజేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ అధికారులను ఆదేశించారు.
- ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో ప్రమాదాలు జరిగిన తర్వాత సహాయ చర్యలు చేపట్టడం కంటే.. ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చేపడుతున్న చర్యల గురించి ఆరా తీశారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో నీటి ఎద్దడి రాకుండా చూడాలని సూచించారు.
- అంతకుముందు అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కై లాసపట్నం బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన ఎనిమిది మంది కార్మికులకు సంతాపం తెలుపుతూ.. మౌనం పాటించారు. వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఫార్మా కంపెనీ, ఇతర ప్రమాదాల్లో మరణించిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వపరంగా ఒకే రకమైన ఎక్స్‌గ్రేషియా అందించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కోరారు. దీనిపై తీర్మానం చేస్తామని చైర్‌పర్సన్ వెల్లడించారు. ఈ సమావేశంలో అరకు ఎంపీ గుమ్మా తనుజారాణి, అనకాపల్లి కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ కె. మయూర్ అశోక్, ఏఎస్ఆర్ జేసీ అభిషేక్ గౌడ, ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్ బాబు, రేగం మత్స్యలింగం, కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పి.వి.జి.కుమార్, సీఈవో నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పవన్ వ్యాఖ్యలు అవాస్తవం

- వైఎస్సార్‌సీపీ హయాంలోనే మన్యం అభివృద్ధి
- 98 కి.మీ.కాదు.. 498 కి.మీ రోడ్లు వేశాం: అరకు ఎంపీ



మాట్లాడుతున్న అరకు ఎంపీ తనూజారాణి

ఏజెన్సీలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 98 కిలోమీటర్లు మాత్రమే రోడ్లు వేశారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యల్లో నిజం లేదని అరకు ఎంపీ డాక్టర్ తనూజారాణి అన్నారు. ఇటీవల పవన్ కల్యాణ్ అరకులో పర్యటించిన సమయంలో గిరిజనుల సంక్షేమం కోసం పాటుపడతామని చెప్పడం మంచిదన్నారు. కానీ రోడ్లకు సంబంధించి పవన్ చేసిన వ్యాఖ్యలు వాస్తవం కాదన్నారు. ఇక్కడ వైఎస్సార్ సీపీ పనిచేయలేదని చెప్పడం సంబంధిత మంత్రిగా ఆయనకు తగదన్నారు. విశాఖ మన్యంలో గత ఐదేళ్లలో 498 కిలో మీటర్ల మేర రోడ్లు వేసినట్లు గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో మన్యం ఎంతో అభివృద్ధి చెందిందని చెప్పారు. మన్యంలో అన్ని పీహెచ్‌సీలు, పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించినట్లు తెలిపారు. నాడు–నేడు పనులతో గణనీయమైన ప్రగతి సాధించామన్నారు. వీటిని చెప్పకుండా రోడ్లు బాగులేవని ప్రజలను తప్పుదారి పట్టించేలా వ్యాఖ్యలు చేయడం సరి కాదన్నారు.

బాలికల సదన్‌లో కలకలం

- ప్రహరీ ఎక్కి దూకేస్తానని బాలిక హల్‌చల్

ఆరిలోవ: విశాఖ వ్యాలీ పాఠశాల పక్కన ఉన్న ప్రభుత్వ బాలికల సదన్‌లో బుధవారం జరిగిన ఓ ఘటన కలకలం రేపింది. సదన్‌లో 9వ తరగతి చదువుతున్న ఓ బాలిక మళ్లీ ప్రహరీ ఎక్కి.. దూకేస్తానంటూ హల్‌చల్ చేసింది. దీంతో అప్రమత్తమైన సదన్ సిబ్బంది ఆ బాలికకు ఎలాంటి ప్రమాదం జరగకుండా కిందకు దించారు. ఈ ఘటనపై గృహం సూపరింటెండెంట్ ఎస్.సునీత మాట్లాడుతూ మానసిక పరిస్థితి సరిగా లేని కారణంగానే బాలిక ఇలా ప్రవర్తించిందని తెలిపారు. గోడపైకి ఎక్కి ఆమె పెద్దగా కేకలు వేయడంతో సిబ్బంది అప్రమత్తమయ్యారని చెప్పారు. వెంటనే ఆ బాలికను గృహం వైద్యుడు, సిబ్బంది కలిసి ప్రభుత్వ మానసిక ఆస్పత్రికి తరలించారని ఆమె వెల్లడించారు.

ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్‌లో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సులో 3 నెలలు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 ఏళ్లలోపు వయసున్న ఆసక్తి గల పురుష అభ్యర్థులు అర్హులన్నారు. 10వ తరగతి, ఆపై అర్హతలున్నవారు ఈ నెల 21లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. వివరాలకు 9948768778 నంబర్లో సంప్రదించాల్సిందిగా సూచించారు.

జీవీఎంసీ ఈఈగా వాసు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కార్యనిర్వాహక ఇంజినీర్(ఈఈ)గా వెంకట వాసు నియమితులయ్యారు. పబ్లిక్ హెల్త్ ఉప కార్యనిర్వాహక ఇంజినీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వాసుకు ఈఈగా పదోన్నతి కల్పిస్తూ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి నాటక పోటీలు

- రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రదర్శనగా 'ఇది అతని సంతకం'



విజేతలతో వీఎండీఏ బృందం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా స్థానిక కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించిన పైడా కౌశిక్ రాష్ట్ర స్థాయి నాటక పోటీలు బుధవారం ఘనంగా ముగిశాయి. చివరి రోజు ప్రదర్శించిన 'రాత'నాటకం అందరినీ ఆకట్టుకుంది. రాష్ట్ర స్థాయి నాటక పోటీల్లో గుంటూరి అభినయ ఆర్ట్స్ వారి 'ఇది అతని సంతకం'ఉత్తమ ప్రదర్శనగా ఎంపికయింది. ద్వితీయ ప్రదర్శనగా అమరావతి ఆర్ట్స్ వారి 'చిగురు మేఘం', తృతీయ ప్రదర్శనగా విజయవాడ యంగ్ థియేటర్ ఆర్ట్స్ వారి '27వ మైలురాయి', చతుర్థి ప్రదర్శనగా ఉక్కునగరానికి చెందిన చైతన్య కళా స్రవంతి వారి 'అసత్యం'నాటకాలు బహుమతులు సాధించాయి. న్యాయ నిర్ణేతలుగా విశ్రాంత ఆచార్యులు బాబీవర్ధన్, ఒ.ఎ.వేణు, సత్యప్రసాద్‌లు వ్యవహరించారు. ఇది అతని సంతకం ప్రదర్శనకు ఉత్తమ నటుడు, ఉత్తమ దర్శకత్వం, 27వ మైలురాయికి ఉత్తమ నటి, ఉత్తమ రచన అవార్డులు దక్కాయి. బహుమతులుగా నగదు, జ్ఞాపికలను వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు మంతెన సత్యనారాయణరాజు, డాక్టర్ గుమ్మలూరి రాంబాబు, పైడా కృష్ణప్రసాద్, సాంబశివరావు, జి.పవన్‌కుమార్, ఒ.నరేష్ కుమార్, వి.ధర్మేందర్‌ల చేతుల మీదుగా అందించారు.

ఇంట్లోకొచ్చి.. బంగారం గొలుసు లాక్కెళ్లి..

- వృద్ధురాలి మెడలో 2 తులాల గొలుసు చోరీ చేసిన యువకుడు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచర్లు రెచ్చిపోతున్నారు. వరుస దొంగతనాలతో స్థానికులను హడలెత్తిస్తున్నారు. శివాజీపాలెం, మద్దిలపాలెం ఘటనలు మరువక ముందే ఎంవీపీ కాలనీలో బుధవారం మరో చైన్ స్నాచింగ్ జరిగింది. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలిలా.. సేవాన లలిత(90) అనే వృద్ధురాలు ఎంవీపీ కాలనీ సెక్టార్–8లో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తోంది. బుధవారం మధ్యాహ్నం ఆమె ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో గుర్తు తెలియని ఓ యువకుడు ఇంట్లోకి ప్రవేశించి 2 తులాల బంగారు చైన్ లాక్కెళ్లాడు. హఠాత్ పరిణామంతో ఆమె కేకలు పెట్టగా.. అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై వృద్ధురాలు ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలిస్తున్నారు.

జీవీఎంసీ కమిషనర్‌నే నియమించలేరా?

- కూటమి ప్రభుత్వానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సూటి ప్రశ్న
- పేదలకు ఇళ్లు/ఇళ్ల స్థలం మంజూరు చేయాలని డిమాండ్



ఆశీలమెట్ట నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్తున్న సీపీఎం నాయకులు

సీతమ్మధార: రాష్ట్రంలోనే అతిపెద్ద కార్పొరేషన్‌కు నాలుగు నెలలుగా కమిషనర్‌ను నియమించకుండా కూటమి ప్రభుత్వం ఏం చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. నగరంలో దశాబ్దాల తరబడి సొంతిల్లు లేని పేదలకు ఇల్లు లేదా రెండు సెంట్ల ఇంటి స్థలం మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పేదలకు ఇల్లు, ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం వందలాది మందితో ఆర్టీసీ కాంప్లెక్స్ గురజాడ జంక్షన్ నుంచి ఆశీలమెట్ట మీదుగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వరకు 'చలో జీవీఎంసీ' చేపట్టారు. అనంతరం పార్టీ 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు అధ్యక్షతన జరిగిన సభలో వి.శ్రీనివాసరావు మాట్లాడారు. దశాబ్దాల తరబడి సొంతిల్లు లేని పేదలు అద్దె ఇళ్లలో ఉంటూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా.. పాలకులకు ఏమాత్రం పట్టడం లేదని విమర్శించారు. 15 ఏళ్లుగా ఇళ్లు లేని లబ్ధిదారులను గుర్తించినప్పటికీ నేటికీ వారికి సొంతింటి కల నెరవేరలేదన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఇళ్ల కోసం అనేక మంది అప్పులు చేసి డీడీలు కట్టినా వారికి ఇళ్లు మంజూరు చేయలేదన్నారు. మేయర్ పదవి కోసం కూటమి కార్పొరేటర్లు విదేశీ యాత్రలు చేస్తూ ప్రజా సమస్యలను గాలికొదిలేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. విశాఖలో ప్రజలకు అందుబాటులో ఉండే కార్పొరేటర్లు కేవలం సీపీఎం, సీపీఐ కార్పొరేటర్లేనని ఆయన గుర్తు చేశారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ ఇతర ప్రాంతాల నుంచి విశాఖకు వలస వచ్చి నివసిస్తున్న పేదలు సొంతింటి కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. టిడ్కో, జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని, పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, బి.జగన్, పి.మణి, జోన్ కార్యదర్శులు ఆర్.ఎస్.ఎన్.మూర్తి, వి.కృష్ణారావు, ఎం.సుబ్బారావు, బొట్టా ఈశ్వరమ్మ, పి.పైడిరాజు, ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.96,170
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.87,150
వెండి(కిలో):	రూ.1,10,000

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.130
స్కిన్	: రూ.230
స్కిన్‌లెస్	: రూ.240

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	425.00
విజయనగరం	429.00
శ్రీకాకుళం	429.00

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం



90 మీటర్ల ఎత్తులో అగ్నిప్రమాదం జరిగితే ఎలా రక్షించాలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సీతమ్మధార: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మూడవ రోజు సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్‌లో అగ్నిప్రమాదాల నివారణ చర్యలపై ఫైర్ సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. ఏడీఎఫ్‌వో పి.సింహాచలం ఆధ్వర్యంలో సిబ్బంది పలు విన్యాసాలు చేశారు. 90 మీటర్ల ఎత్తైన ప్రదేశాల్లో ప్రమాదంలో చిక్కుకున్న వారిని బ్రాంటో స్కైలిఫ్ట్ ద్వారా ఎలా రక్షించవచ్చో చూపించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఉపయోగించాల్సిన పరికరాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను నివాసితులకు వివరించారు. అగ్నిప్రమాద భద్రతపై రూపొందించిన కరపత్రాలు పంచిపెట్టారు.

నూకాంబిక హుండీ ఆదాయం రూ.41.52 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

అనకాపల్లి టౌన్: గవరపాలెం నూకాంబిక అమ్మవారి హుండీల లెక్కింపు ద్వారా రూ.41,51,973ల నగదు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు తెలిపారు. ఈ ఏడాది మార్చి 15 నుంచి ఏప్రిల్ 16 వరకు నెల రోజుల్లో నగదు రూపంలో ఈ మొత్తం వచ్చిందని, ఇంకా 15.5 గ్రాముల బంగారం, 700 గ్రాముల వెండి వస్తువులను భక్తులు సమర్పించినట్లు తెలిపారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగ శ్రీను, కమిటీ సభ్యులు సూరే సతీష్, దాడి రవికుమార్, పొలిమేర ఆనంద్, కాండ్రేగుల రాజారావు, మజ్జి శ్రీనివాసరావు, టౌన్ ఎస్ఐ వెంకటేశ్వరరావు, యూనియన్ బ్యాంకు సిబ్బంది లెక్కింపులో పాల్గొన్నారు.

పట్టపగలే చుక్కలు చూపిస్తారు..

- తాళం వేసుంటే ఇట్టే దోచేస్తారు
- రెండేళ్లలో 21 దొంగతనం కేసులు
- బాలుడితో సహా ఆరుగురు ముఠా అరెస్ట్
- నిందితుల నుంచి 63 తులాల బంగారం, 6.5 తులాల వెండి, రూ.15 వేల నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా వెనుక చోరీ కేసుల నిందితులు



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

అనకాపల్లి: సాధారణంగా రాత్రి పూట దొంగతనాలు చేస్తారు.. అందరూ నిద్రలో ఉన్నప్పుడు ఎవరికీ కనబడకుండా పని కానిచ్చేస్తారు.. కానీ ఈ ముఠా మాత్రం ఎంచక్కా పగలే చోరీలు చేస్తారు.. గుట్టుచప్పుడు కాకుండా, పక్కింటికి కూడా తెలీకుండా ఇళ్లు దోచేస్తారు.. అదీ వారి ప్రత్యేకత. వారి పనితనం చూసి పోలీసులే విస్తుపోయారు. ఎస్పీ తుహిన్ సిన్హా తన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోలీసులకు చిక్కిన ఈ ముఠా వివరాలు వెల్లడించారు. ఈ బృందంలో ఒక బాలుడితో సహా ఆరుగురు ఉన్నారు. అందరూ దగ్గరి బంధువులే. వీరు 2023 నుంచి ఇంతవరకు మొత్తం 21 దొంగతనాల్లో పాల్గొన్నారు. వీరి నుంచి 63 తులాల బంగారం, 6.5 తులాల వెండి వస్తువులు, రూ.15 వేల నగదును కోటవురట్ల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కోటవురట్ల మండలం రాజుపేట గ్రామానికి చెందిన పాలమరశెట్టి దుర్గాప్రసాద్, భీశెట్టి లోకేష్, యల్లపు భూపతి, మడుతూరి సూర్య, మునగపాక మండలం జంగాలవీధికి చెందిన దొడ్డి ఆదిబాబుతో పాటు కోటవురట్ల మండలానికి చెందిన ఒక బాలుడు ఈ ముఠాలో ఉన్నారు. ప్రధాన నిందితుడు పాలమరశెట్టి దుర్గాప్రసాద్ చిన్నతనంలో తండ్రి మరణించడంతో జల్సాలకు బానిసై ఆన్‌లైన్ బెట్టింగ్ చేసేవాడు. డబ్బుల కోసం చోరీలకు అలవాటు పడ్డాడు. దొంగిలించిన బంగారాన్ని తన బావమరిది దొడ్డి ఆదిబాబు వద్ద భద్రపరిచేవాడు. అప్పటికే ఆదిబాబు తొమ్మిది మోటార్ సైకిల్ దొంగతనాల కేసుల్లో నిందితుడు. పై ఆరుగురు వ్యక్తులు రెండేళ్ల కాలంలో కోటవురట్ల మండలంలో 6, నర్సీపట్నం రూరల్‌లో 3, మాకవరపాలెంలో 3, కశింకోటలో 3, బుచ్చెయ్యపేటలో 2, యలమంచిలి టౌన్‌లో 1, నాతవరం మండలంలో 1, యలమంచిలి రూరల్‌లో 2 చోరీలకు పాల్పడినట్లు ఎస్పీ తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను పట్టుకున్నామన్నారు. కశింకోట మండలంలో చోరీ మాత్రమే రాత్రి పూట చేశారని, మిగిలినవి ముందుగా పగటి వేళ రెక్కీ నిర్వహించి, ఉదయం పూట దర్జాగా చేశారని ఆయన పేర్కొన్నారు. బుధవారం నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారని, బాలుడిని జువనైల్ హోమ్‌కు తరలించామన్నారు. అనంతరం పై కేసుల్లో ప్రతిభ కనబర్చిన పోలీస్ సిబ్బందిని ప్రశంసాపత్రాలతో ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన్‌రావు, నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీసీఎస్ సీఐ కె.అప్పలనాయుడు, నక్కపల్లి సర్కిల్ సీఐ ఎల్.రామకృష్ణ, ఎస్ఐలు ఎస్.రమేష్, పి.రమేష్, సీసీఎస్ ఏఎస్పీ కేజేఐజీపీ కుమార్, విశ్వేశ్వరరావు, హెచ్‌సీ శివ తదితరులు పాల్గొన్నారు.